మహిళా మార్ట్.. మంచి ప్రాఫిట్

- లాభాల బాటలో చేయూత మహిళా మార్ట్
- రెండు నెలల్లో రూ.30 లక్షల టర్నోవర్
- గ్రామీణ ప్రజల నుంచి మంచి ఆదరణ



చేయూత మహిళా మార్ట్ ప్రగతిని గుర్తించి మహిళా సమాఖ్య సభ్యులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

తొండంగి: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అతివలు వ్యాపారాలు చేసి ఆర్థిక స్వావలంబన సాధించేలా వారిని ప్రోత్సహిస్తోంది. ఈ మేరకు అక్కచెల్లెమ్మలకు ప్రభుత్వం రుణాలు కూడా మంజూరు చేస్తోంది. అతివలు వ్యాపారులుగా కూడా రాణించాలనే లక్ష్యంతో వైఎస్సార్‌క్రాంతి పథం ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య, స్వయం సహాయక సంఘాల మహిళల సహకారంతో మండలంలోని ఎ.కొత్తపల్లిలో చేయూత మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. ఈ మార్ట్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన రావడంతో లాభాల బాటలో పయనిస్తోంది.

23 వేల మంది సభ్యులతో మార్ట్ ఏర్పాటు

గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాలకు చెందిన 23 వేల మంది సభ్యులు రూ.42 లక్షల క్యాపిటల్ సొమ్ముతో చేయూత మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. గతేడాది డిసెంబర్ 27న రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి, ఎంపీ వంగా గీత ఈ మార్ట్‌ను ప్రారంభించారు. మార్కెట్‌లో రిటైల్ ధరల కంటే తక్కువగా హోల్‌సేల్ ధరలకు ఫ్యాన్సీతో పాటు నిత్యావసర సరుకులు మార్ట్‌లో విక్రయించడంతో కేవలం రెండు నెలల వ్యవధిలోనే రూ.30 లక్షల టర్నోవర్‌కు చేరువైంది. సరాసరి రోజుకు రూ.50 వేలు వరకూ అమ్మకాలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలైన పి.చిన్నాయపాలెం, గోపాలపట్నం, కొమ్మనాపల్లి, సీతారాంపురం, తొండంగి, రావికంపాడు, శృంగవృక్షం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు పట్టణాల్లో ఉండే ప్రైవేటు మార్ట్‌లకు వెళ్లకుండా ఎ.కొత్తపల్లి మార్ట్‌లోనే సరుకులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో చేయూత మహిళామార్ట్ లాభాలబాటలో పయనిస్తోంది. మార్ట్ టర్నోవర్ పెరగడం, సంఘంలోని సభ్యులకు లాభదాయకంగా ఉండటంతో పాటు మార్ట్ ద్వారా మరికొంత మంది మహిళలకు ఉపాధి కూడా లభిస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఎ.కొత్తపల్లిలోని చేయూత మహిళా మార్ట్



చేయూత మహిళా మార్ట్‌లో నిత్యావసర వస్తువులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కలెక్టర్ ప్రశంసలు

తక్కువ కాలంలోనే చేయూత మహిళా మార్ట్ అమ్మకాలు రూ.30 లక్షలకు చేరడంతో ఇటీవల మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మండల మహిళా సమాఖ్య సభ్యులను ఘనంగా సన్మానించారు. వ్యాపారం మరింత వృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

ప్రజల నుంచి మంచి ఆదరణ



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎ.కొత్తపల్లిలో చేయూత మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ మార్ట్‌ను ప్రజలు ఆదరిస్తున్నారు. రెండు నెలల్లోనే దాదాపుగా రూ.30 లక్షల టర్నోవర్ జరిగింది. మార్ట్ ప్రాథమిక పెట్టుబడిలో షేర్ హోల్డర్లుగా ఉన్న మహిళలు అందరూ మార్ట్‌లోనే నిత్యావసర వస్తువులు కొనుగోలు చేస్తే మరింత లాభాలు చేకూరుతాయి.

– వై.సత్తిబాబు, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం, తొండంగి మండలం

అమ్మకాలు పెరిగాయి



ఎ.కొత్తపల్లిలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చేయూత మహిళా మార్ట్ ఏర్పాటు చేశారు. తక్కువ ధరతో పాటు నాణ్యత ఉండడంతో పరిసర గ్రామాల ప్రజలు ఇక్కడే సరకులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో అమ్మకాలు పెరిగాయి. ఇదే స్ఫూర్తితో మరింత అభివృద్ధి చేస్తాం. మమ్మల్ని వ్యాపారులుగా తీర్చిదిద్దిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– అద్దాల సూర్యకాంతం, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, తొండంగి

క్లుప్తంగా

డ్రోన్‌తో ఎరువుల పిచికారీపై అవగాహన



రంపయర్రంపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో రైతులకు డ్రోన్‌తో ఎరువుల పిచికారీపై గురువారం అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఐసీఏఆర్–సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు డ్రోన్ ఉపయోగించి ఎరువులు ఏ విధంగా పిచికారీ చేయాలో ప్రత్యక్షంగా చూపించారు. సుమారు 25 కేజీల బరువు ఉండే డ్రోన్ సహాయంతో ఒక ఎకరంలో కేవలం 8 నుంచి 10 నిమిషాల్లోనే ఎరువులు పిచికారీ చేయవచ్చన్నారు. తద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోరుకొండ ఏడీఏ బి.మల్లికార్జునరావు, ఏఓ పి.రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన



కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు

కోటనందూరు: స్థానిక భోగలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించే కల్యాణ మండపానికి గురువారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు శంకుస్థాపన చేశారు. తొలుత ఎంపీపీ శ్రీనివాసు, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మండపం నిర్మాణానికి ప్రజలు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, మల్లంపల్లి ప్రకాష్, దార్ల సూర్యచంద్ర, శివాలయ కమిటీ చైర్మన్ వత్సవాయి నారాయణమూర్తి రాజు పాల్గొన్నారు.

ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



రమేష్ బాబు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ అల్లాడ రమేష్ బాబుకు డాక్టరేట్ లభించినట్టు కళాశాల వైస్ చైర్మన్ ఎన్.సతీష్ రెడ్డి గురువారం తెలిపారు. కళాశాలలోని హెచ్‌బీఎస్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా సేవలందిస్తున్న రమేష్‌బాబు కడప కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మ్యాథ్స్ ప్రొఫెసర్ బి.రామభూపాల్ రెడ్డి నేతృత్వంలో 'ఏ స్టడీ ఆన్ ఫుజీ లీనియర్ ప్రోగ్రామింగ్ ఫర్ ఆప్టిమైజేషన్ ప్రాబ్లెమ్స్' అనే శీర్షికతో సమర్పించిన థీసిస్‌కు అనంతపురం యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసినట్టు వివరించారు. డాక్టరేట్ పొందిన రమేష్‌బాబుకు ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఎన్.శేషారెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, డోలా సంజయ్, డీన్ ఎ.రామకృష్ణ, విభాగాధిపతి పద్మప్రవీణ్, , పి.వేణుగోపాల్, పలు విభాగాధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట: విద్యుత్ సబ్‌స్టేషన్లలో వార్షిక మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక ట్రాన్స్ కో డీఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. రామవరం,రాజపూడి ఫీడర్ల పరిధిలోని మల్లిసాల, రాజపూడి, గోవిందపురం, మన్యవారిపాలెం, జె.కొత్తూరు, వెంగాయమ్మపురం, కృష్ణాపురం, సీతారాంపురం గ్రామాలతో పాటు భావవరంలోని లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కోడి పందేలాడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని గోవిందపురం గ్రామ శివారులో కోడి పందేల శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో కోడి పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.2100 స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా కోడిపందేలు, గుండాట, పేకాట వంటి జూదాలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు



దివ్యాంగ చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలోని దివ్యాంగ చిన్నారులకు గురువారం ఫిజియోథెరపీ సేవలందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో చేయించాల్సిన వ్యాయామాలు, పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఐఈఆర్పీ రాంబాబు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

తుని రూరల్: మండలంలోని హంసవరంలో పశువులకు గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ వ్యాక్సినేషన్‌ను సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ప్రారంభించారు. తేటగుంట వెటర్నరీ ఆస్పత్రి వైద్య సిబ్బంది రైతులు వద్దకు వెళ్లి ఆవులు, గేదెలకు ఉచితంగా వ్యాక్సిన్ వేశారు. గ్రామంలో 410 పశువులకు వ్యాక్సిన్ వేసినట్టు సర్పంచ్ మేరీఅవినాష్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఈ.శంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు రాయి పాపారావు, దాసు, వెటర్నరీ అసిస్టెంట్ రవికుమార్, సచివాలయ కన్వీనర్ మురళి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఏలేశ్వరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

తుని/ఏలేశ్వరం: దీర్ఘకాలంగా ఉన్న పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తుని నియోజకవర్గ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మాధవరావు కోరారు. ఈ మేరకు గురువారం తుని ట్రెజరీ కార్యాలయ అధికారికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2018 జూలై 1 నుంచి బకాయి ఉన్న డీఏ ఏరియర్స్, 11వ పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, పెన్షన్లు చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏలేశ్వరంలో పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ సూరప రాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తుని పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి డేనియల్ జోసెఫ్, ఉపాధ్యక్షుడు ఆంజనేయ ప్రసాద్, చింతకాయల అప్పలకొండ, ఏలేశ్వరం పెన్షనర్ల సంఘ నాయకులు ఉద్దగిరి సోమరాజు, ఎండీ ఇబ్రహీంఖాన్, పొన్నాడ జోగిరాజు, చెన్నాప్రగడ సత్యగాంధీ, జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గౌరంపేటలో పారిశుధ్య డ్రైవ్

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గౌరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గౌరంపేటలో గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

శివారు ప్రాంతాలకు రక్షిత తాగునీరు



తాగునీటి సరఫరాపై చర్చిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: గ్రామాల్లోని శివారు ప్రాంతాలకు సైతం రక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామని ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తెలిపారు. కోటనందూరులోని వాటర్ ట్యాంకుల క్లీనింగ్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. నీటి వృథాను, అక్రమ మోటార్ల వినియోగాన్ని అరికట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామ శివారు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల తాగునీటి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు రాజానాగేశ్వరరావు, భారతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యవతిని సన్మానిస్తున్న మెప్మా సిబ్బంది

ఏలేశ్వరం: మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి సూచించారు. మెప్మా ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్నిరంగాల్లోనూ అగ్రస్థానం కల్పించారన్నారు. నేటి సమాజంలో మహిళలు రాణిస్తున్నారన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో పురుషులకు సమానంగా మహిళలు ముందంజలో ఉన్నారన్నారు. అనంతరం మెప్మా సిబ్బంది చైర్‌పర్సన్ అలమండ సత్యవతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొండలరావు, అలమండ చలమయ్య, మెప్మా సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గండేపల్లి: విద్యార్థులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సెంటర్ ఆఫ్ వుమెన్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల మేధస్సును పెంచేందుకు దోహదపడతాయన్నారు. ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ఇనిషియేటివ్ హనీవెల్ అనే గ్లోబల్ సర్టిఫికేషన్ కోర్సును తమ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థినులకు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, ఎస్.శంభూప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, ప్రిన్సిపాల్ కె. సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ జి.నరేష్, ఎస్.కోటేశ్వరి, పి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఉపాధి పనులు

- డ్వామా పీడీ వెంకటలక్ష్మి



పెద జగ్గమ్మ చెరువులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

గండేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు తప్పనిసరిగా ఉపాధి హామీ పనులు కల్పించాలని కాకినాడ జిల్లా డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి సిబ్బందికి సూచించారు. మండలంలోని నీలాద్రిరావుపేట పెద జగ్గమ్మ చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఉపాధి హామీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. జిల్లావ్యాప్తంగా రోజుకు లక్ష పనిదినాలు కల్పించాల్సి ఉండగా వ్యవసాయ పనులు అందుబాటులో ఉన్నందున కూలీలు ఉపాధి పనులకు రాకపోవడంతో ప్రస్తుతం 40,000 వేల పనిదినాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 17 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉందన్నారు. ఒక్కో మేటు తమ పరిధిలోని 50 కుటుంబాలకు పనులు కల్పించాలన్నారు. పనులు పాదర్శకంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట ఉపాధి ఏపీఓ ఎన్.గంగాభవానీ, అబ్బు, తదితరులు ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న లోవస్థానం చైర్మన్ అచ్చియ్యనాయుడు, ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రధానమంత్రి సురక్షా మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ) కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.ఇందిరా ప్రియదర్శిని 55 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులకు ఆరోగ్య పరమైన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ గర్భిణులు ప్రతిరోజూ సమతుల్య పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని సూచించారు. గర్భిణులకు లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు ఆర్థిక సహాయంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, కోఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మైనింగ్ ప్రాంతం పరిశీలన

శంఖవరం: మండలంలోని వజ్రకూటంలో గ్రావెల్ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని గురువారం మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ మనీషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనింగ్ డీడీ నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఈ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించినట్లు తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వివరించారు. ఆమె వెంట మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

పెద్దాపురం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల వేగవంతంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం ఆయా గ్రామాల సచివాలయాల పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఏఈ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ లబ్ధిదారుల్లో ఉన్న స్వయం సహాయక సంఘాల నుంచి అందించే రుణాలను సకాలంలో అందించి ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ సచివాలయాలు, ఆర్బీకే, ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలను సత్వరం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యాలయ సీనియర్ సహాయకులు జగన్నాథం, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల నిరసన

తుని: అమరావతి జేఏసీ పిలుపు మేరకు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మునిపల్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్ఆర్ ప్రసాద్, ఎస్వీ రామారావు, రాణి, శివాజీ పాల్గొన్నారు.

స్కూల్‌జోన్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

తొండంగి: మండలంలోని గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులపై స్కూల్ జోన్ల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అన్నవరం జాతీయ రహదారిని కలుపుతూ గోపాలపట్నం నుంచి ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం, తొండంగి, ఒంటిమామిడి వరకూ ప్రధాన రహదారి ఉంది. ఈ రోడ్డు మీదుగా నిత్యం వేలాది సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇటీవల కాలంలో వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ రద్దీ మరింత ఎక్కువైంది. గోపాలపట్నంలో ఉన్న రెండు స్కూళ్ల వద్ద నిత్యం ఉదయం, సాయంత్రం విద్యార్థులు రహదారిని క్రాస్ చేసే సమయంలో వాహనాల వేగం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం జెడ్పీహైస్కూళ్ల వద్ద కూడా ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మంచి కుటుంబ కథా చిత్రం ఎవడు వాడు

రౌతులపూడి: ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్ల ద్వారా యువత పెడదోవ పట్టకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలనే ఉద్దేశంతో తీసిన మంచి కుటుంబ కథా చిత్రం 'ఎవడు వాడు' అని సినీ హీరో రెడ్డి కార్తికేయ అన్నారు. రాజేశ్వరీ సినీ క్రియేషన్స్ బేనర్‌పై ఎవడు వాడు సినిమా శుక్రవారం విడుదల అవుతున్న నేపథ్యంలో హీరో రెడ్డి కార్తికేయ గురువారం రౌతులపూడిలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో యువత సెల్‌ఫోనే జీవితం అన్నట్లుగా బతుకుతున్నారన్నారు. నిత్యం సెల్‌ఫోన్లు వాడి పెడదోవ పట్టి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అలాంటి వారికి మంచి జీవితాన్ని అందించడమే ఈ చిత్రం సారాంశమన్నారు. ఆర్.నారాయణమూర్తి సినీ వారసుడిగా తనను ప్రేక్షకుల ఆదరించాలని కోరారు.

పొగాకు కోతలు పూర్తి



కేఓ మల్లవరంలో కోతలు పూర్తవడంతో ప్రత్యేక పందిళ్లలో ఆరబెట్టిన పొగాకు

తుని రూరల్: మండలవ్యాపంగా పొగాకు కోతలు పూర్తయ్యాయి. మండలంలోని కేఓ మల్లవరం, హెచ్.కొత్తూరు, వెంకటాపురం గ్రామాల్లో రైతులు వంద ఎకరాల్లో నాటు పొగాకును సాగు చేస్తున్నారు. ఇందులో ఒక్క కేఓ మల్లవరంలోనే 90 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో రైతులు పొగాకు కోతలు కోసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్లలో తడి ఆరబెడతారు. ప్రస్తుతం కోతలు పూర్తవ్వడంతో రైతులు పందిళ్లలో తడి ఆరబెడుతున్నారు. తడి ఆరిన తర్వాత నాణ్యత, రంగు, రుచి పెంచేందుకు కుప్పలు వేసి నెలరోజులు ఉంచుతామని, ఆ తర్వాత కుప్పలు తెరిచి బేళ్లుగా కడతామని రైతులు తెలిపారు. పొగాకు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఇప్పటికే కొంతమంది రైతులకు అడ్వాన్సులు ఇచ్చారు. ధర నిర్ణయించిన తర్వాత నాణ్యతను బట్టి చెల్లింపులు చేయనున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



అవల్దార్‌పాడులో అగ్నిప్రమాద బాధితులకు బియ్యం, నిత్యావసరాలు అందజేసిన పోలీసులు

తొండంగి: పెరుమాళ్లపురం పంచాయతీ అవల్దార్‌పాడులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు స్థానిక పోలీసులు చేయూతను అందించారు. అవల్దార్‌పాడులో ప్రమాదం జరిగిన స్థలాన్ని గురువారం ఎస్సై రవికుమార్, ఏఎస్సై రాయవరపు వెంకటరమణ పరిశీలించారు. బాధితులు కొంజర్ల సత్యవతి, నాగలోవ దుర్గలను పరామర్శించారు. బాధితులకు నిత్యావసర వస్తువులు, 100 కిలోల బియ్యం, ఇతర సామగ్రి అందజేశారు. కష్టాల్లో ఉన్న బాధితులకు సహాయం చేయడంతో గ్రామ పెద్దలు పోలీసులను అభినందించారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి

తొండంగి: మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పసపులేటి సతీష్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తొండంగిలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని డ్రైన్లలో పూడిక తీత, చెత్త తొలగింపు పనులతో పాటు వాటర్ ట్యాంకుల క్లీనింగ్‌పై దృష్టి సారించాలన్నారు. సీజనల్ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చేసిన పనులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.